క్లుప్తంగా

డ్రెయినేజీ సమస్యను పరిష్కరిస్తాం



ఆదర్శనగర్ కాలనీలో పర్యటిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్

నిర్మల్‌టౌన్: భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా కేంద్రంలో డ్రెయినేజీ సమస్యను త్వరలో పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ తెలిపారు. జిల్లా సమీకృత కార్యాలయం వద్ద గల డబుల్ బెడ్రూంలను శనివారం పరిశీలించి, స్థానిక ఆదర్శనగర్ కాలనీలో ఆయన పర్యటించారు. కాలనీలో డ్రెయినేజీలను పరిశీలించారు. జేసీబీతో దగ్గరుండి డ్రెయినేజీలను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలను దృష్టిలో పెట్టుకుని మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ప్రజాప్రతినిధులు, అధికారులకు పలు సూచనలు అందిస్తున్నారని తెలిపారు. వర్షాలకు ప్రజలకు ఇబ్బందులు ఎదురైతే మున్సిపల్ కార్యాలయంలో 24 గంటలు సేవలందించేలా కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఏవైనా సమస్యలుంటే టోల్ ఫ్రీ నెంబర్ 7993396793కు కాల్ చేసి సమాచారం అందించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, అధికారులు, కౌన్సిలర్లు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి



మాట్లాడుతున్న కుడాల స్వామి

నర్సాపూర్(జి): పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి కుడాల స్వామి డిమాండ్ చేశారు. మండల కేంద్రంతోపాటు నందన్, బామ్ని(బి), అర్లి(కే), చాక్‌పల్లి, కుస్లీ గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ ఆదేశాలతోనే హైదరాబాద్‌లో ఆగస్టు రెండోవారంలో నిర్వహించే మాదిగల విశ్వరూప మహాసభకు తరలిరావాలని కోరారు. జిల్లా నాయకుడు గజేందర్, మండల నాయకులు ముత్యం, ప్రతాప్, రమేశ్, గంగాధర్ పాల్గొన్నారు.

ఆలయ హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న ఆలయ సభ్యులు

లోకేశ్వరం: మండలంలోని రాయపూర్‌కాండ్లీ గ్రామంలోని శ్రీలక్ష్మీ నరసింహా స్వామి ఆలయ హుండీని శనివారం లెక్కింపు చేపట్టారు. రూ.46,350 హుండీ ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ అభివృద్ధి కోసం ఖర్చు చేస్తామని చైర్మన్ రాజేశ్వర్ తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు గజ్వేరి భూమన్న, దేవన్న, వెంకట్, దేవేందర్, మన్మద్ లింగం ఉన్నారు.

పచ్చిరొట్ట పరిశీలన

సోన్: మండలంలోని న్యూ బొప్పారం గ్రామంలో పచ్చిరొట్టను డీఏవో అంజిప్రసాద్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. పచ్చిరొట్ట ఎరువులు వాడటం వలన కలుపు సమస్య తగ్గుతుంది. ఏఈ జి.వినోద్, ఏఈవో అంబాజీ ఉన్నారు.

గ్రామాల శుభ్రతపై దృష్టి సారించాలి

తానూరు: వర్షాకాలం దృష్టిలో పెట్టుకుని గ్రామాల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రావ్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందికి శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య సిబ్బందితో మురుగు కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. ఎంపీవో మోహన్‌సింగ్, ఏపీవో గంగాధర్ పాల్గొన్నారు.

నేడు రాష్ట్ర పద్మశాలి వివాహ పరిచయ వేదిక

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం, దొడ్డి కొమురయ్య హాల్, బాగ్ లింగంపల్లిలో ఆదివారం ఏడవ రాష్ట్ర పద్మశాలి వివాహ పరిచయ వేదిక ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటలకు ఏర్పాటు చేసినట్లు జిల్లా అధ్యక్షుడు బూర ఉమా శంకర్ ఓ ప్రకటనలో తెలిపారు. అబ్బాయిలు, అమ్మాయిలు పోస్ట్ కార్డు ఫొటో, బయోడేటాతో రావాలని పేర్కొన్నారు. వివరాలకు 9949349470 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

లోలెవెల్ వంతెనలతో ఇక్కట్లు



ఓలా శివాలయం లోలెవెల్ వంతెన వద్ద వరద ఉధృతిని పరిశీలిస్తున్న అధికారులు



లింబా(బి) గ్రామం వద్ద లోలెవెల్ వంతెనపై వరద నీరు

- ఇబ్బందుల్లో ప్రజలు
- రాకపోకలకు అంతరాయం
- ఏటా తప్పని తిప్పలు

తానూరు/కుంటాల: వర్షాకాలం వస్తే చాలు..వాగులు ఉధృతంగా పొంగి రహదారులు జలమయం అవుతాయి. ప్రతీ ఏటా ఆ గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఎగువ కురుస్తున్న వర్షాలకు లోలెవల్ వంతెనల పైనుంచి వరదనీరు ప్రవహించడంతో గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. హై లెవెల్ వంతెనలు నిర్మించాలని అధికారులు, ప్రజాప్రతినిధులు కోరినా పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు.

కుంటాల మండలంలో..

వర్షాల కారణంగా కుంటాల మండలంలోని ఓలా, వెంకూర్, లింబా(బి) గ్రామాల సమీపాన లోలెవల్ వంతెనలపై వరద నీరు ప్రవహిస్తోంది. రాకపోకలు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఓలా గ్రామ సమీపంలో లోలెవల్ వంతెన నుంచి భారీ వర్షాలు కురిస్తే వరద నీరు ప్రవహించడంతో సూర్యాపూర్, అంబుగామ, మెదన్‌పూర్ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. లింబా(బీ) వద్ద లోతట్టు పైనుంచి వరద నీరు వెళ్తే కుభీర్, భైంసా మండలాలకు రాకపోకలు నిలిచిపోతాయి. కొత్త వెంకూర్ నుంచి పాత వెంకూర్‌లో మధ్య లోలెవల్ వంతెన పై వరద నీరు చేరడంతో విఠాపూర్, పెంచికల్‌పాడ్, భైంసా మండలాలకు రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. దీంతో ప్రయాణికులు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

హైలెవల్ వంతెన నిర్మించాలి



సూర్యాపూర్ నుంచి ఉన్నత చదువుల కోసం ఓలా, కుంటాల పాఠశాలలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఓలా వద్ద లోలెవల్ వంతెన పైనుంచి వరద నీరు చేరడంతో ఇబ్బంది పడుతున్నారు. హై లెవెల్ వంతెన నిర్మించాలి.

– రొడ్డ రాజేశ్వర్, సూర్యాపూర్

రాకపోకలు బంద్



తానూరు మండలంలోని ఝరి(బి) సమీపంలోని లోలెవల్ వంతెన. ఇక్కడ మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల నుంచి వరద నీరు వస్తోంది. చెరువు నిండితే చిన్నపాటి వర్షం కురిసిన వంతెన పై నుంచి వరద నీరు చేరుతుంది. ఈ మార్గంలో ఝరి(బి)తండా, ఝరి(బి), మహారాష్ట్రలోని బోథి, సావర్‌గాం గ్రామాలకు రవాణా సౌకర్యం నిలిచిపోతున్నాయి.

వరద రాక ముందే ఇంటికి..



చిన్నపాటి వర్షాలకు మొగ్లి లోలెవల్ వంతెన పై నుంచి వరద నీరు చేరుతుంది. హిప్నెల్లితండా అటవీ ప్రాంతం నుంచి భారీగా వరద నీరు వంతెనపై ప్రవహించడంతో మొగ్లి, మసల్గా, మహారాష్ట్రంలోని ఉమ్రి, తదితర గ్రామాలకు రవాణా సౌకర్యం నిలిచిపోతున్నాయి. వరద నీరు రాక మందే గ్రామాల ప్రజలకు ఇంటికి చేరుకోవాలిన్సిన పరిస్థితి వారికి తప్పడం లేదు. వరదలు వస్తే ఆ మార్గంలో బస్సు సౌకర్యాలను అధికారులు నిలిపివేస్తున్నారు.

ఇబ్బంది పడుతున్నాం

వర్షం కురిస్తే ఝరి(బి) సమీపంలో లోలెవల్ వంతెనపై వరద నీరు పారుతోంది. ప్రతీ ఏటా వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నాం. వరదలు వచ్చిన వ్యవసాయ పొలాలకు వెళ్లలేక పోతున్నాం. అధికారులు స్పందించాలి. – శివదాస్, ఝరి(బి)

ప్రతిపాదనలు పంపిస్తాం

తానూరు మండలంలోని ఝరి(బి), తొండాల వంతెనలు పరిశీలించి అవసరం ఉన్న చోట బ్రిడ్జి మంజూరుకు ఉన్నతా అధికారులకు ప్రతిపాదనలు పంపుతాం. మహాలింగి, బోంద్రట్ గ్రామాల్లో బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టాం. వాడవన గ్రామంలో బ్రిడ్జి నిర్మాణానికి టెండర్లు పిలిచి నిర్మాణ పనులు ప్రారంభిస్తాం. – జాదవ్ చందు, పీఆర్ డీఈ



దుంకి పారుతున్న హకీంచెరువు అలుగు



అందకూర్‌లో మత్తడి నుంచి చేరుతున్న వరద నీరు

మత్తడి పోస్తున్న బూర్కుంట చెరువు

కుంటాల: ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తోంది. అందకూర్, పెద్దచెరువు, కుంటాలలోని బూర్కుంట చెరువు మత్తడి పోస్తున్నాయి. ప్రకృతి అందాలను ప్రజలు వీక్షిస్తున్నారు. కాగా, 44.4మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఏఎస్‌వో సాయన్న తెలిపారు.

లక్ష్మణచాంద: నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండల కేంద్రంలోని ఊర చెరువు నిండు కుండలా మారింది. హకీం చెరువు నిండటంతో అలుగు దుంకి పారుతుంది. దీంతో అలుగు అటు వైపు వెళ్లే చూపరులను ఆకట్టుకుంటుంది.

బూత్‌స్థాయి నుంచి పార్టీని పటిష్టం చేయాలి

- బీజేపీ పెద్దపల్లి ఇన్‌చార్జి రాంనాథ్



మాట్లాడుతున్న రావుల రాంనాథ్

నిర్మల్‌చైన్‌గేట్: బూత్ స్థాయి నుంచి బీజేపీని పటిష్టం చేయాలని పార్టీ పెద్దపల్లి ఇన్‌చార్జి రావుల రాంనాథ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో శనివారం నిర్మల్ మండల బీజేపీ శక్తి కేంద్రం ఇన్‌చార్జీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే నాలుగు నెలల్లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, కల్వకుంట్ల కుటుంబం, జిల్లా మంత్రి ఇంద్రకరణ్ రెడ్డిపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. నియోజకవర్గంలో భూకబ్జాలు, బీ వన్ పట్టాల కుంభకోణంపై మంత్రికి ఉన్న వ్యతిరేకత పార్టీకి అనుకూలంగా మార్చుకోవాలన్నారు. సమావేశంలో మండల నాయకులు అంజుకుమార్‌రెడ్డి, జమాల్, ప్రధాన కార్యదర్శులు లవకుమార్‌గౌడ్, నరేశ్, ఉప సర్పంచులు నర్సిరెడ్డి, హరీశ్, నాయకులు రఘువీర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శక్తి కేంద్రం ఇన్‌చార్జీలు పాల్గొన్నారు.

ఘనంగా ఆండాళ్ తిరునక్షత్రం



పూజలు చేస్తున్న భక్తులు

మామడ: మండలంలోని పొన్కల్ శ్రీలక్ష్మీవేంకటేశ్వర ఆలయంలో ఆండాళ్ తిరునక్షత్రం ఉత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. గోదాదేవి జన్మదినం సందర్భంగా ఉత్సవ విగ్రహాలను పూలతో అలంకరించారు. అర్చకులు రామచంద్రాచార్యులు, విజయ్‌లు ఆండాళ్ తిరునక్షత్రం విశిష్టతను భక్తులకు వివరించారు. భక్తులు ఆలయంలో పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వారికి తీర్థప్రసాదాలు అందజేశారు.

అనాథ పిల్లలకు ఆర్థికసాయం

భైంసాటౌన్: పట్టణంలోని నేతాజీనగర్‌కు చెందిన పలువురు కాలనీవాసులు, దాతలు తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ పిల్లలకు ఆర్థికసాయం అందజేశారు. నేతాజీనగర్‌కు చెందిన సురేఖ, భూమన్నలకు ముగ్గురు సంతానం. ఐదేళ్ల క్రితం భూమన్న అనారోగ్యంతో, వారం క్రితం సురేఖ మృతిచెందింది. దీంతో వీరి పిల్లలు రామ్, శ్యాం, శివ అనాథలుగా మారారు. నానమ్మ వద్ద ఆశ్రయం పొందుతున్నారు. కాలనీకి చెందిన పలువురు శనివారం రూ.52వేల ఆర్థికసాయం అందజేశారు. కాలనీవాసులు రమేశ్, రాజేశ్వర్, తదితరులున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

భైంసారూరల్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యుడు సందీప్ సూచించారు. మండలంలోని గుండేగాం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం శుక్రవారం రెండోరోజూ కొనసాగింది. జ్వరం, కడుపునొప్పి, బీపీ, షుగర్, తదితర రోగాలకు సంబంధించిన వైద్య పరీక్షలు చేశారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సోమ్‌నాథ్, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు, గ్రామస్తులు ఉన్నారు.

ఓటరు జాబితా సామర్థ్య పెంపుపై శిక్షణ



హాజరైన బీఎల్వోలు



అవగాహన కల్పిస్తున్న ట్రైనర్ మధు

భైంసారూరల్: భైంసా మండల పరిషత్ కార్యాలయంలో ఓటరు జాబితా సామర్థ్య పెంపుపై బీఎల్ఓలకు ఎన్నికల మాస్టర్ ట్రైనర్లు వెల్మల మధు, రాఘవేంద్ర శనివారం శిక్షణ ఇచ్చారు. ఓటరు జాబితా తయారుచేయాలన్నారు. ఓటరు నమోదు, మృతిచెందినవి తొలగింపు, తప్పుల సవరణ తదితర అంశాలపై వివరించారు. అనంతరం బీఎల్వోలకు సామర్థ్య పరీక్ష నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ సూర్యప్రకాశ్ ఉన్నారు.

భైంసారూరల్: మండలంలోని బాబుల్‌గాం, ఎగ్గాం, బిజ్జూర్, కోతల్‌గాం గ్రామాల్లో శనివారం ఓటింగ్ యంత్రాలపై ఆర్ఐ కృష్ణాగౌడ్ అవగాహన కల్పించారు. ఓటింగ్ యంత్రాలపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలన్నారు. ఓటు ప్రాముఖ్యతను తెలియజేశారు. అనంతరం ఈవీఎం, వీవీప్యాడ్‌ల పనితీరును వివరించారు. సర్పంచులు, నాయకులు, ఓటర్లు తదితరులు ఉన్నారు.

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈవీఎంలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. గ్రామస్తులకు ఈవీఎం, వీవీ ప్యాట్ల గురించి డిప్యూటీ తహసీల్దార్ గంగాధర్ వివరించారు. సర్పంచ్ ముత్యంరెడ్డి, పంచాయతీ కార్యదర్శి విక్రమ్ రాజ్, ఉప సర్పంచ్ శ్రీనివాస్, ఏఎస్సై గంగాధర్ తదితరులు ఉన్నారు.

లోకేశ్వరం/దస్తురాబాద్: లోకేశ్వరం మండల కేంద్రంతోపాటు రాజూర గ్రామాల్లో ప్రజలకు, మండలంలోని ఆకోండపేట, దేవునిగూడెం గ్రామాల్లో బీఎల్‌వోలకు ఈవీఎంలపై అవగాహన కల్పించారు. డిప్యూటీ తహసీల్దార్లు షబ్బీర్, తెలంగరావ్, సర్పంచ్ ముత్తగౌడ్ తదితరులు ఉన్నారు.

ఖానాపూర్ అభివృద్ధిలో విఫలం



మాట్లాడుతున్న జానుబాయి

ఖానాపూర్: నియోజకవర్గ కేంద్రమైన ఖానాపూర్ అభివృద్ధి చేయడంలో స్థానిక ఎమ్మెల్యే విఫలమయ్యారని బీజేపీ నియోజకవర్గ నాయకురాలు పెంబి జెడ్పీటీసీ బుక్యా జానుబాయి ఆరోపించారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతిభవనంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో జానుబాయి మాట్లాడారు. రెండేళ్లుగా పట్టణంలో రోడ్డు పనులు పూర్తిచేయించలేదని అన్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్లపై వెళ్లేందుకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. గతేడాది అధిక వర్షాలకు కడెం ప్రాజెక్టుకు ముప్పు తప్పడంతో ప్రజలంతా ఊపిరిపీల్చుకున్నారని అన్నారు. ఈ ఏడాది ప్రాజెక్ట్ గేట్లకు మరమ్మతు చేయించలేని దుస్థితిలో ఎమ్మెల్యే ఉన్నారని పేర్కొన్నారు. పట్టణంలో డబుల్‌బెడ్‌రూం ఇళ్లలో అధికార పార్టీకి చెందిన అనేక మంది అనర్హులకు చోటు కల్పించారన్నారు. తహసీల్దార్ కార్యాలయభవనం శిథిలావస్థలో ఉండడంతో ఎప్పుడు కూలుతుందో తెలియని దుస్థితి ఉందన్నారు. సమావేశంలో నాయకులు గోపాల్‌రెడ్డి, స్వామి, సుధాకర్, రాజేష్, రవి, లక్ష్మణ్, పవన్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

‘పాలకవర్గం వైఫల్యంతోనే అభివృద్ధిలో వెనుకంజ’

ఖానాపూర్: మున్సిపల్ పాలకవర్గం వైఫల్యంతోనే పట్టణ అభివృద్ధి కుంటుపడుతుందని ఖానాపూర్ మాజీ సర్పంచ్ ఆకుల శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రోడ్డు నిర్మాణాల్లో చైర్మన్, కౌన్సిలర్లు కమీషన్ల కోసం డిమాండ్ చేయడంతో కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు వెనుకంజ వేస్తున్నారని ఆరోపించారు. ఇంటి నిర్మాణాలకు డబ్బులు వసూళ్లకు పాల్పడుతున్నారని, ఆధారాలతో నిరూపిస్తానని అన్నారు. అభివృద్ధిపై మున్సిపల్ సమావేశాల్లో ప్రశ్నించాల్సింది పోయి గైర్హాజరైన కౌన్సిలర్లపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. సమావేశంలో నాయకులు దాసరి రాజన్న, లక్ష్మణ్, మాదాసు మురళి పాల్గొన్నారు.

ఖానాపూర్‌లో ‘డబుల్’ సందడి



డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద లబ్ధిదారులు

ఖానాపూర్: పట్టణంలోని కుమురంభీం చౌరస్తాలోని ప్రభుత్వ స్థలంలో నిర్మించిన 400 డబుల్ బెడ్రూం ఇళ్లు లబ్ధిదారులతో సందడిగా మారాయి. ఇటీవల నిర్వహించిన లక్కీడీప్‌లో ఎంపికైనవారు వారివారి ఇళ్లలోకి వెళ్లాలని అధికారులు తెలిపారు. శనివారం పలువురు సామగ్రితో వెళ్తుండగా, ఇంకొందరు ఇళ్లకు తాళాలు వేసుకుంటున్నారు. అంతకుముందు మున్సిపల్ కార్యాలయం వద్ద జాబితాలో పేర్లు చూసుకునేందుకు గుంపులు, గుంపులుగా తరలివచ్చారు. మరోవైపు తాము అర్హులైనప్పటికి జాబితాలో పేర్లు రాలేదని పలువురు బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లక్కీడీప్‌లో ఎంపిక చేసిన జాబితాను మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేశామని కమిషనర్ మనోహర్ తెలిపారు. జాబితాలో వారి ఇంటినంబర్ ఆధారంగా వారి ఇళ్లలోకి వెళ్లి ఉండాలని పేర్కొన్నారు.

స్లాబ్ పెచ్చులు తొలగింపు



నిర్మల్‌చైన్‌గేట్: కురుస్తున్న వర్షాలకు జిల్లా ప్రసూతి ఆస్పత్రిలో పైకప్పు పెచ్చులూడి నీరు లీకవుతూ.. ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. ఎప్పుడు కూలుతాయోనని సిబ్బంది ముందస్తుగా శనివారం స్లాబ్ పెచ్చులను తొలగించారు.

సంక్షిప్తంగా

కార్మిక గర్జనకు తరలిరావాలి

సోన్: ప్రభుత్వాలు బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ హైదరాబాద్‌లో ఆగస్టు 4న నిర్వహించే కార్మిక గర్జనకు తరలిరావాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కె.రాజన్న కోరారు. మండలంలోని న్యూవెల్మల్ గ్రామంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీడీ కార్మికులకు జీవనభృతి అమలు చేయాలని, ఈపీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు.

సిద్దార్థనగర్‌లో వైద్యశిబిరం

భైంసాటౌన్: పట్టణంలోని సిద్దార్థనగర్‌లో అర్బన్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. హెచ్‌ఈవో కలీమోద్దీన్ ఉన్నారు.

ప్రఖండ గోరక్షక్ సంయోజక్‌గా పవన్

ఖానాపూర్: ఖానాపూర్ ప్రఖండ గోరక్షక్ సంయోజక్‌గా దాదె పవన్ శుక్రవారం రాత్రి ఎన్నికయ్యారని బజరంగ్‌దళ్ జిల్లా సంయోజక్ కాసవేణి ప్రణయ్ తెలిపారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

కుంటాల: రైతులు రైతుబీమా కోసం ఆగస్టు 10వరకు దరఖాస్తులు చేసుకోవాలని ఏఈవో గణేశ్ పేర్కొన్నారు. కల్లూర్‌లో రైతుబీమాపై శనివారం అవగాహన కల్పించారు.

‘తప్పుడు ఆరోపణలు చేస్తే ఊరుకోం’

భైంసా: ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిపై తప్పుడు ఆరోపణలు చేస్తే ఊరుకోబోమని బీఆర్‌ఎస్ బాసర మండల అధ్యక్షుడు కోర్వ శ్యామ్ అన్నారు. బాసరలో పార్టీ నాయకులు పలువురు ప్రజాప్రతినిధులతో కలిసి శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కొందరు నాయకులు పదవులు అనుభవించి ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. బాసర మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, బాసర సర్పంచ్ లక్ష్మణ్‌రావు, నాయకులు రామారావు పాల్గొన్నారు.

నేడు నీటి సరఫరా నిలిపివేత

భైంసాటౌన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం నీటి సరఫరా నిలిపేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. కుంచవలి పహాడ్ వద్ద వాల్వ్ లీకేజీకి మరమ్మతు నేపథ్యంలో గోపాల్‌నగర్, ఓవైసీనగర్, ఏపీనగర్, పిప్రికాలనీ, శివాజీనగర్, పులేనగర్, రాజీవ్‌నగర్, ఐబీ ప్రాంతంలో నీటి సరఫరా ఉండదన్నారు.

ఆలయంలో పూజలు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని భగవాన్ శ్రీ మురళీకృష్ణ ఆలయంలో అధికమాసం సందర్భంగా ప్రియదర్శినినగర్ కాలనీ మహిళలు శనివారం పూజలు చేశారు.

పరామర్శ

లక్ష్మణచాంద: మండలంలోని ర్యారం మాజీ సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి మేనత్త లింగవ్వ, చామన్‌పెల్లికి చెందిన జంగన్న అనారోగ్యంతో మృతి చెందారు. కాంగ్రెస్ జిల్లా నాయకుడు కూచాడి శ్రీహరిరావు బాధిత కుటుంబీకులను పరామర్శించారు.

వృద్ధులకు రక్త పరీక్షలు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని సాగర్ కాలనీలో గల డవ్ వృద్ధాశ్రమంలో శాంత ఫౌండేషన్ ఆధ్వర్యంలో 30 మంది వృద్ధులకు రక్త పరీక్షలు నిర్వహించారు.

కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె

లక్ష్మణచాంద/ముధోల్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. శనివారం నాటికి సమ్మె 17వ రోజు చేరింది. ముధోల్‌లో కార్మికులు గడ్డితింటూ నిరసన వ్యక్తం చేశారు. లక్ష్మణచాందలో కార్మికులు సమ్మె పాల్గొని తమ నిరసన తెలిపారు.

‘సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి’

ముధోల్: మణిపూర్ ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని భీం ఆర్మీ జిల్లా అధ్యక్షుడు విఠల్ కాంబ్లే డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ ఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

రేపు జిల్లాకు పాత పెన్షన్ సంకల్ప రథయాత్ర

నిర్మల్‌రూరల్: పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర సోమవారం జిల్లాకేంద్రానికి చేరుకుంటుందని సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణారావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని బైల్ బజార్ వద్ద రథయాత్రకు స్వాగతం పలుకుతామని, అక్కడి నుంచి పాత కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ ఉంటుందని పేర్కొన్నారు. అక్కడే రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ ప్రసంగిస్తారని తెలిపారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

ఖానాపూర్: ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బాలె మల్లేశ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు హాజరుకావాలని కోరారు.

డబుల్ బెడ్రూంలు పరిశీలన

నిర్మల్‌టౌన్: నిర్మల్‌లో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లలో నాణ్యత లేదని ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా ఇన్‌చార్జి కన్వీనర్ సయ్యద్ హైదర్ ఆరోపించారు. జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయం ఎదుట గల డబుల్ బెడ్రూం ఇళ్లను శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేరుకు మాత్రమే డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మించారన్నారు. వర్షానికి స్లాబ్ పై భాగం పెచ్చులు పెచ్చులుగా ఊడిపోతుందని తెలిపారు. సాయికుమార్, షబానా బేగం, సోఫి ఇమ్రాన్, ఆతీఫ్ ఖాన్, మహ్మద్ముసేబ్ తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

లక్ష్మణచాంద: సైబర్ నేరాలపై మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సల్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. మండలంలోని పీచర గ్రామంలో బస్టాండ్ వద్ద సైబర్ నేరాలపై ప్రజలకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ బ్యాంక్ ఖాతా, ఆధార్, ఏటీఎం పిన్ నంబర్ వివరాలను అపరిచితులు ఫోన్ చేసి అడిగితే చెప్పవద్దని అన్నారు.

విద్యుత్ బిల్లు మాఫీని సద్వినియోగం చేసుకోవాలి

ఖానాపూర్: పట్టణంతో పాటు మండలంలోని ఎస్సీ, ఎస్టీ గృహ విద్యుత్ వినియోగదారులు 100 యూనిట్ల బిల్లు మాఫీని సద్వినియోగం చేసుకోవాలని ఏఈ తిరుపతి కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం గతంలో చెప్పిన మాదిరిగానే ఒక్కో ఇంటికి 100 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగదారులకు పూర్తిగా మాఫీ ఉంటుందన్నారు.